
సప్తఋషులు ఎవరెవరు?



మన పురాణాలలో సప్తఋషుల ప్రస్తావన అనేక సందర్భాలలో కనిపిస్తుంటుంది. ఎవరెవరిని సప్తఋషులు అని పిలుస్తామో మనలో చాలామందికి తెలియదు. వారి వివరాలివి :

అత్రి, కశ్యప, గౌతమ, జమదగ్ని, భరద్వాజ, వశిష్ఠ, విశ్వామిత్రులను సప్తఋషులని పిలుస్తారు. వీరిలో విశ్వామిత్రుడు క్షత్రియుడైనప్పటికీ తపస్సు చేసి బ్రహ్మర్షి అని అనిపించుకున్నాడు.



సప్త ఋషులే కాకుండా అనేకమంది తపస్సంపన్నులైన ఋషులెందరో ఉన్నారు. ముందుగా సప్తఋషుల గురించి తెలుసుకుందాం.

అత్రి మహర్షి

అత్రి మహర్షి బ్రహ్మ మానసపుత్రుడు. 'సృష్టి' లో తనకు ఒక సహాయకుడు కావాలని బ్రహ్మ అనుకున్నప్పుడు, ఆయన మనోశక్తితో జన్మించిన వాడు అత్రి. ఆయన భార్య అనసూయ. అత్రి మహర్షి చేసిన ఘోరమైన తపస్సుకు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ఒకేసారి ప్రత్యక్షమైనారు. త్రిమూర్తులు తనకు సంతానంగా జన్మించాలని అత్రి మహర్షి కోరుకున్నాడు. అప్పుడు ఆయనకు ముగ్గురు కుమారులు జన్మించారు. బ్రహ్మ అంశలో చంద్రుడు, విష్ణుమూర్తి అంశలో దత్తాత్రేయుడు, శివుడి అంశలో దూర్వాసుడు జన్మించారు. అత్రి మహర్షి పేరుతో ఆత్రేయ ధర్మశాస్త్రము ఉంది. తొమ్మిది అధ్యాయాలున్న ఈ శాస్త్రంలో ధర్మానికి సంబంధించిన ఎన్నో విషయాలున్నాయి.

తండ్రికి కీర్తి తెచ్చిన అష్టావక్రుడు

ఏకపాదుడనే మహా విద్వాంసుని కుమారుడు అష్టావక్రుడు. అష్టావక్రుడు తల్లి గర్భమునందున్న సమయంలో, శిష్యులకు విద్యనేర్పుతున్న ఏకపాదుడిని చూసి, "ఎందుకు శిష్యులను ఇంత కఠోర శ్రమకు గురిచేస్తావు?" అని ప్రశ్నిస్తాడు అష్టావక్రుడు. దీనికి కోపించిన ఏకపాదుడు. "నువ్వు ఎనిమిది వంకరలతో జన్మించు" అని శపిస్తాడు. ఆ శాప ఫలితంగా ఎనిమిది వంకరలతో జన్మించి అష్టావక్రుడని పేరు తెచ్చుకుంటాడతడు. ధనసంపాదన కోసం జనకుని వద్దకు వెళ్ళిన ఏకపాదుడు ఎంతకాలానికీ తిరిగి రాకపోవడం చూసిన అష్టావక్రుడు చివరకు తనే జనకుడి సభకు వెళ్తాడు.

అక్కడ వరుణపుత్రుడను పండితుడు తన తండ్రిని ఓడించి, తన చెరలో ఉంచుకున్నాడని తెలిసి అతడిని ఓడించి తన తండ్రిని చెర నుంచి విడిపిస్తాడు అష్టావక్రుడు. ఎంతో కాలం ఒక చెరువు మధ్యలో తపస్సు చేస్తుంటాడు అష్టావక్రుడు. ఎందరో అప్సరసలు అప్పుడతడిని నృత్యగానాలతో సంతృప్తి పరచి విష్ణుమూర్తి తమకు భర్త అయ్యేటట్టు వరం పొందుతారు. కృష్ణావతారంలో ఈ వరం ఫలిస్తుందని చెప్పిన అష్టావక్రుడు చెరువు నుంచి బయటకు రాగానే అతడి ఆకారాన్ని చూసి అప్సరసలు నవ్వుతారు. దీనితో ఆగ్రహించిన అష్టావక్రుడు, "కృష్ణుడు మీకు భర్త అయినప్పటికీ ఆయన అవతార పరిసమాప్తి సమయంలో, ఆయన పరోక్షంలో మీరు అవమానాల పాలవుతారు" అని శపిస్తాడు. ఈ శాప ప్రభావం వల్లనే ద్వారకా నగరం మునిగిపోయే సమయంలో గోపికలు అనేక అవమానాల పాలయ్యారని చెబుతారు.

రాజధర్మాలపై గ్రంథకర్త- భరద్వాజుడు.

భరద్వాజుడు, దేవగురువు బృహస్పతి కుమారుడు. బృహస్పతికీ, ఆయన వదిన మమతకూ జన్మించిన వాడు భరద్వాజుడు. మహాభారతంలోని కురుపాండవులకు కులగురువైన ద్రోణుని తండ్రి ఇతడు. రామాయణ కాలంలో వనవాసం చేస్తున్న రామునికి భరద్వాజుడు కొంతకాలం ఆశ్రయమిచ్చాడు. దివోదాసు అనే క్షత్రియుడికి యుద్ధవిద్యలు నేర్పించిన భరద్వాజుడు ధర్మశాస్త్రాల గురించి గ్రంథం రాశాడు. ఆ గ్రంథానికే భరద్వాజ స్మృతి అని పేరు. చాణుక్యుని అర్థశాస్త్రం వలె భరద్వాజ స్మృతిలో అనేక విషయాలున్నాయి. రాజుకు ఉండవలసిన లక్షణాలను వివరిస్తూ, రాజు అన్నవాడు శత్రువుతో మృదువుగా సంభాషించాలి. పంది వలె మూలాన్ని పెకలించాలి. సకల సంపదలు సాధించాలి. మేరువు వలె నిశ్చలంగా ఉండాలి. అంటూ రాజులకు ఉండవలసిన ఒక్కో జంతువులోని ఒక్కో విశిష్ట గుణం గురించి ఈ స్మృతిలో వివరించారు. భరద్వాజుడు వైమానిక శాస్త్రం కూడా రచించాడు. ఈ గ్రంథంలో ఎన్నో రహస్యాలున్నాయని చెబుతారు.

భృగు తనయుడు చ్యవనుడు

చ్యవనుడు మూలికా వైద్యంలో సుప్రసిద్ధుడు. భృగు మహర్షి, పులోమల కుమారిడితడు. బాల్యం నుండే తపస్సు ప్రారంభించాడతడు. అనేక సంవత్సరాలు అలా తపస్సులో మునిగిపోగా, ఆయన చుట్టూ పుట్టలు లేచాయి. కొంతకాలానికి ఆ ప్రాంత రాజు, తన కుమార్తె సుకన్యతో ఆ ప్రాంతానికి వస్తాడు. ఈ పుట్టలో నుంచి కాంతులు వెలువడడం చూసిన సుకన్య పుట్టను తవ్వించడానికి ప్రయత్నించినప్పుడు చ్యవనుడు బయటపడతాడు. అప్పటికతడు వృద్ధుడు. సుకన్య తండ్రి అక్కడకు వచ్చి జరిగింది తెలుసుకుని, క్షమించమని మహర్షిని ప్రార్థిస్తాడు. తన కుమార్తెనిచ్చి వివాహం చేస్తాడు. ఒకసారి సుకన్యను చూసిన అశ్వనీ దేవతలు, తమతో వస్తే తగిన వరుడిని చూపుతామని చెబుతారు. తన వృద్ధాప్యాన్ని పోగొట్టి తనను యవ్వనవంతునిగా చేయాలని, అపుడు సుకన్యను పంపుతానని షరతు విధిస్తాడు చ్యవనుడు. దీనికి అంగీకరించి తమతో ఒక కొలనులో స్నానం చేయమని అశ్వనీ దేవతలు చ్యవనుడికి సూచిస్తారు. కొలనులో స్నానం చేస్తూ, ఒక మునక మునిగి పైకి లేచే సరికి ముగ్గురూ యవ్వనంలో ఉన్న యువకుల వలె మారడమే కాకుండా ఒకే రూపురేఖలు వస్తాయి. వారిలో ఒకరిని ఎంచుకోమని అశ్వనీదేవతలు కోరతారు. సుకన్య తన భర్తను గుర్తించడంతో ఆమె పాతివ్రత్యాన్ని, చ్యవనుడి తపోశక్తిని పూర్తిగా తెలుసుకుని వెళ్ళిపోతారు అశ్వనీ దేవతలు. ఆ తర్వాత, తనకు యవ్వనమిచ్చిన అశ్వనీదేవతలకు యాగములో సోమపానము ఇప్పిస్తాడు. దీనికి ఆగ్రహించిన ఇంద్రుడు చ్యవనుడిని దండించడానికి ప్రయత్నించగా, తన తపోశక్తితో ఇంద్రుడిని శక్తిహీనుడిగా మారుస్తాడు చ్యవనుడు. చ్యవనుడి తపోశక్తి, ఆయన జాలి గుణం గురించి ఎన్నో కథలు వ్యాప్తిలో ఉన్నాయి.

దధీచి

దధీచి చ్యవన మహర్షి కుమారుడు. చిన్నతనం నుంచీ దధీచి తపస్సు చేస్తుండేవాడు. ఇతని కుమారుడు సారస్వతుడు. దధీచి ఒకసారి తన బాల్య స్నేహితుడైన క్షుపుడనే రాజుతో యథాలాపంగా వాదన ప్రారంభించి, ఆ వాదనలో బ్రాహ్మణులే గొప్పవారని చెప్పడంతో, క్షుపుడు ఆగ్రహంతో దధిచిని సంహరిస్తాడు. శుక్రాచార్యుడు మృతసంజీవని విద్యతో దధీచిని తిరిగి బ్రతికిస్తాడు. దధీచి శివుడి గురించి తపస్సు చేసి, స్వచ్ఛంద మరణాన్ని, వజ్రం వంటి శరీరాన్ని, విజయశక్తిని వరాలుగా పొందుతాడు. కొంతకాలానికి దేవదానవులకు యుద్ధం జరుగుతుంది. ఆ యుద్ధంలో ఓడిపోయిన దేవతలు తమ ఆయుధాలను దధీచి వద్ద దాచి, తిరిగి తాము వచ్చినప్పుడు ఆ ఆయుధాలను తిరిగి ఇవ్వమని కోరతారు. ఎంతకాలానికీ దేవతలు తిరిగి రాకపోవడంతో, ఆ ఆయుధాలను భద్రంగా దాచే శక్తి తనకు లేదని దధీచి, ఆయుధా లన్నింటినీ మింగేస్తాడు. ఆ ఆయుధాలన్నీ ఆయన శరీరంలో జీర్ణమైపోతాయి. చాలాకాలం తర్వాత దేవతలు వచ్చి, ఆయుధాల గురించి అడగగా, జరిగింది చెప్పి, తన దేహమే ఆయుధాగారం వలె అయిపోయినది, మీకు అవసరమొచ్చినప్పుడు ప్రాణాలను పరిత్యజించి ఆయుధాలను ఇస్తానని దేవతలకు వాగ్దానం చేసి వారిని పంపేస్తాడు.

ఇది జరిగిన కొద్దికాలానికి వృత్రాసురుడు అనే రాక్షసుడు స్వర్గం పై దండెత్తుతాడు. ఎన్నో వరాలు పొందిన ఆ రాక్షసుడు సాధారణ ఆయుధాల వల్ల మరణించడు. చివరకు ఇంద్రుడు తదితర దేవతలు దధీచి వద్దకు వెళ్ళి, తమకిప్పుడు శక్తివంతమైన ఆయుధాల అవసరమున్నదని చెబుతాడు. వృత్రాసురుడి గురించి తెలుసుకున్న దధీచి, తన వెన్నెముకను ఆయుధంగా తీసుకోవలసిందిగా ఇంద్రుడికి సూచించి, ప్రాణత్యాగం చేస్తాడు. మిగిలిన దధీచి ఎముకలను ఆయుధాలుగా స్వీకరించిన దేవతలు రాక్షసులతో యుద్ధం చేసి విజయం సాధిస్తారు. దధీచి కుమారుడు పిప్పలాదుడు.

'గౌతమి'ని భువికి తెచ్చిన గౌతముడు!

సప్తఋషులలో ఒకడు గౌతముడు. అహస్య వివాహ సమయమున ఇతడి పేరు వినిపిస్తుంది. బ్రహ్మ అతిలోక సుందరి అయిన ఒక యువతిని సృష్టించి, ఆమెకు అహల్య అని పేరు పెట్టాడు. ఆమెకు వివాహం చేయాలనుకుని 'ఎవరు ముందుగా భూమిని చుట్టివస్తారో వారికి ఈమెనిచ్చి వివాహం చేస్తా!' అని ప్రకటించాడు. ఆమెను వివాహం చేసుకోవడానికి వచ్చిన ఇంద్రుడు, తదితర దేవతలు భూమిని చుట్టిరావడానికి వెళ్తే, గౌతముడు, రెండు ముఖాలున్న ఆవుకు ప్రదక్షిణ చేసి వచ్చాడు. ఇది భూప్రదక్షిణతో సమానమని భావించి, బ్రహ్మ అహల్యను గౌతముడికిచ్చి వివాహం చేశాడు. తను చల్లిన విత్తనాలు వెంటనే ఫలాలనివ్వాలని గౌతముడు బ్రహ్మను వేడుకోగా, బ్రహ్మ దానికి అంగీకరించాడు.

గౌతముడు ఆ వర ప్రభావంతో తన ఆశ్రమానికి వచ్చిన అతిథులకు భోజనాదులు సమకూర్చేవాడు. ఒక సంవత్సరం విపరీతమైన కరువు వచ్చింది. ఎక్కడా ఆహారం దొరకని పరిస్థితుల్లో ప్రజలు గౌతముడి వద్దకు వెళ్ళడం ప్రారంభించారు. గౌతముడు తన వద్దకు ప్రజలకు వరప్రభావంతో పండిన పంటతో భోజనం సమకూర్చేవాడు. చివరకు ఇది విపరీతధోరణికి దారితీయడంతో వినాయకుడి ప్రేరణతో ఒక గోవు అక్కడకు వచ్చి, పంట పొలాలను తినేయడం మొదలుపెట్టింది. ఒక దర్భతో గౌతముడు, ఆ గోవును విదిలించగా ఆ గోవు అక్కడికక్కడే చనిపోయింది. గోహత్యా పాతకం నుండి విముక్తి పొందడానికి ఆ ప్రాంతంలో గంగను ప్రవహింపజేయాలని ఇతర మునులు చెప్పడంతో, గౌతముడు శివుడి కోసం తపస్సు చేసి, గంగను భూమి మీదకు నది రూపంలో రప్పించాడు.

గౌతమ ముని ప్రేరణతో ఏర్పడిన ఆ నదికి గౌతమి అనే పేరు వచ్చింది. గోదావరి నుంచి చీలిన నదులలో ఒక చీలికను గౌతమి అని పిలుస్తారు. రామాయణంలో అహల్యకు శాపవిముక్తి సమయంలో కూడా గౌతమ ముని ప్రస్తావన కనిపిస్తుంది. గౌతముడికి శతానందుడనే కుమారుడు, అంజన అనే కుమార్తెలు సంతానం.

కశ్యపుని పేరు మీద వెలసిన ప్రాంతం - కాశ్మీరం

పురాణాలు పేర్కొన్న అత్యంత ప్రాచీనమైన ఋషులలో ఒకరు కశ్యపుడు. కశ్యపుని పేరు మీదగానే కాశ్మీర దేశానికి ఆ పేరు వచ్చిందని చెబుతారు. దేవదానవులకు, నాగజాతికి, మానవ జాతికి జన్మనిచ్చినది కశ్యపుడే అని చెబుతారు. బ్రహ్మ మనస్సు ప్రేరేపించడంతో జన్మించి మరీచుడు కశ్యపుని తండ్రి. దక్ష ప్రజాపతి తన 13 మంది కుమార్తెలను కశ్యపునికిచ్చి వివాహం చేశాడు. వారే దితి, అదితి, వినత, కద్రువ, దాను, అరిష్ట, సురస, సురభి, తామ్ర, క్రోధవస, ఇడ, ఖస, మునిలను ఆయన వివాహమాడారు. గరుడ (గరుత్మంతుడు), అరుణ, వినత కుమారులు, నాగజాతి కద్రువ కుమారులు. ఇలాగే దేవతలు, దానవులు దితి, అదితి వల్ల కలిగిన సంతానం. భాగవతం ప్రకారం స్వర్గలోకంలో నివశించే అప్సరసలు కశ్యపుని కుమార్తెలు. స్వారోచిష మన్వంతర కాలంలోనే కశ్యప మహాముని జీవించి ఉన్నట్టు

పురాణాలు చెబుతాయి. పరశురాముడు భూమండలంలోని క్షత్రియులనందరినీ జయించిన తర్వాత తను పొందిన భూమినంతా కశ్యపునికి దానమిచ్చాడు. పాండవుల మనుమడైన పరీక్షిత్తు పాముకాటుకు గురై, మరణిస్తాడని శాపం పొందిన సందర్భంలో ఆయనను రక్షించడానికి కశ్యపుడు ప్రయత్నించారు. అయితే చివరకు నాగరాజైన తక్షకుడి విజ్ఞప్తి ప్రకారం వెనుదిరిగి వెళ్ళిపోయాడు. ఇలా అనేక సందర్భాలలో మనకు కశ్యపుని ప్రస్తావన కనిపిస్తుంది.

కాలయవనుని భస్మం చేసిన ముచికుందుడు

మాంధాత కుమారులలో ఒకడు ముచికుందుడు. వేలాది సంవత్సరాల పాటు సాగిన దేవాసుర సంగ్రామములో దేవతలకు సహాయపడ్డాడితడు. యుద్ధం సమయంలో నిద్రాహారాలు మానినందు వలన, యుద్ధం ముగిసిన తర్వాత సుదీర్ఘ కాలం పాటు నిద్రపోవాలనే కోరిక అతడికి కలిగింది. తనకు నిద్రాభంగం కలిగించిన వారు భస్మం కావాలని దేవతల నుంచి వరం పొంది, జనసంచారం లేనిచోట ఒక గుహలో నిద్రపోయాడు. కొన్ని సంవత్సరాల తర్వాత శ్రీకృష్ణుడికీ కాలయవనుడికీ యుద్ధం జరిగింది. కాలయవనుడి బారి నుంచి తప్పించుకుంటున్నట్టు కృష్ణుడు యుక్తిగా ముచికుందుడు నిద్రిస్తున్న గుహలోకి వచ్చి అదృశ్యమవుతాడు. కృష్ణుడిని తరుముతూ వచ్చిన కాలయవనుడు గుహలో నిద్రిస్తున్న ముచికుందుడిని చూసి, కృష్ణుడిగా భ్రమించి అతడిపై దాడికి యత్నించగా, నిద్రాభంగమైన ముచికుందుడు కళ్ళుతెరిచి కాలయవనుడిని చూస్తాడు. దాంతో కాలయవనుడు భస్మమవుతాడు.

పిప్పలాదుడు

పిప్పలాదుడు దధీచి కుమారుడు. తండ్రి ప్రాణత్యాగం చేసే సమయానికి పిప్పలాదుడు గర్భస్థ శిశువు. పెరిగి పెద్దవాడైన పిప్పలాదుడు తన తండ్రి దధీచి దేవతల ఆయుధాల కోసం ప్రాణత్యాగం చేశాడన్న వార్త తెలుసుకుని, తన తండ్రి మరణానికి దేవతలే కారణమని పిప్పలాదుడు భావిస్తాడు. దేవతలపై పగబూని, శివుడి గురించి పిప్పలాదుడు తపస్సు చేస్తాడు. శివుడు ప్రత్యక్షం కాగా, దేవతలను సంహరించే శక్తి కల కృత్య అనే శక్తిని వరంగా పొంది, దేవతలను సంహరింపుమని కృత్యను పిప్పలాదుడు ఆదేశిస్తాడు. పిప్పలాదుని ఆదేశం మేరకు కృత్య దేవతలను సంహరించడానికి బయలుదేరుతుంది. విషయం తెలుసుకున్న దేవతలు, పిప్పలాదుని వద్దకు వచ్చి, దధీచి విషయమలో జరిగినదంతా వివరించి, దధీచి ప్రాణత్యాగం చేయడంలో తమ తప్పేమీ లేదని, తమను సంహరించే యోచన మానవలసిందిగా పిప్పలాదుని ప్రార్థిస్తారు. పిప్పలాదుడు తరుణోపాయం సూచించ వలసిందిగా శివుడిని వేడుకుంటాడు. శివుడి సూచన ప్రకారం కృత్యను గంగలో బడబరూపంలో నివశించమని పిప్పలాదుడు సూచిస్తాడు. అలా కృత్యను ఉపసంహరించుకుంటాడు పిప్పలాదుడు. పిప్పలాదుని భార్య పద్మ.

వైశంపాయనుడు

వేదవ్యాసుని శిష్యుడు వైశంపాయనుడు. వేదవ్యాసుని ఆదేశాన్ని అనుసరించి ఇతడు చతుర్వేద సూత్రాలను ఏర్పాటు చేస్తాడు. వైశంపాయనుడు యజుర్వేదాన్ని అధ్యయనం చేశాడు. జనమేజయుడికి మహాభారతగాథను వినిపించింది ఈ మహర్షే.

సూర్య వంశ రాజుల కులగురువు- వసిష్టుడు

సప్తఋషులలో ఒకరైన వసిష్టుడు, సూర్య వంశ రాజుల కులగురువు. ఇక్ష్వాకువంశరాజులైన దశరథుడు, రాముడు తదిరులకు కులగురువుగా ఉన్న వసిష్టుడు బ్రహ్మ మానస పుత్రుడు. మరికొన్ని చోట్ల సూర్యుని కుమారుడు అని కూడా ఉంది. వసిష్టునికి రెండు జన్మలు అనే కథ ఉంది. ఈ కథకు సంబంధించిన వివరాల ప్రకారం నిమి అనే రాజు యజ్ఞం చేయదలచి, వసిష్టుడిని పురోహితునిగా ఉండమని కోరాడు. వసిష్టుడు ఇంద్రుని పురోహితుడిగా ఉండడానికి అప్పటికే అంగీకరించడంతో, ఇంద్రుని వద్ద పని పూర్తయిన తర్వాత నీ చేత యజ్ఞం చేయిస్తానని వసిష్టుడు నిమికి వాగ్దానం చేస్తాడు.

వసిష్టుడు వచ్చే వరకు ఆగకుండా, నిమి గౌతముడి చేత యజ్ఞం చేయిస్తాడు. ఇంద్రుని వద్ద పౌరోహిత్యం ముగిసిన తర్వాత నిమి వద్దకు వచ్చిన వసిష్టుడు ఆగ్రహించి, నిమికి శాపమిస్తాడు. నిమి కూడా ప్రతిశాపవమివ్వడంతో, ఆ శాపాల ప్రభావం వల్ల నిమి, వసిష్టుడు చనిపోతారు. రెండవ జన్మలో వసిష్టుడు అరుంధతిని వివాహమాడతాడు. సప్తఋషులలో ఒకడుగా కీర్తి పొందుతాడు. విశ్వామిత్రుడు తొలుత వసిష్టుడి తపోబలానికి అసూయచెంది, ఆయన కూడా తపస్సు చేసి చివరకు బ్రహ్మర్షి అవుతాడు. ఇంద్రుని సభలోనూ వసిష్టుడికి స్థానం ఉంది.

సృష్టికి ప్రతిసృష్టి చేసిన విశ్వామిత్రుడు

విశ్వామిత్రుడు జన్మతః క్షత్రియుడు. అతని తండ్రి గాధి. కృశాశ్వుని వద్ద శిష్యరికం చేసి అస్త్రశస్త్రాలు సంపాదించాడు. గాధి చనిపోయిన తర్వాత రాజైన విశ్వామిత్రుడు, ఒకసారి అడవులలోకి వేటకు వెళ్ళాడు. వేటాడుతున్న సమయంలో ఆ అడవిలో కనిపించిన వశిష్ఠ మహర్షి ఆశ్రమానికి వెళ్ళాడు. వశిష్ఠ మహర్షి వద్ద నందిని అనే ఆవు ఉన్నది. కామధేనువుకు జన్మించిన ఆ ఆవు కామధేనువు వలే కోరిన కోర్కెలు తీర్చగలదు. ఆశ్రమానికి వచ్చిన రాజును, పరివారాన్ని చూసి, నందినిని ప్రార్థించి భోజనాలు సమకూర్చాడు వశిష్ఠుడు. నందినికి ఉన్న శక్తిని చూసి ఆ ఆవు తనకు ఇవ్వవలసినదిగా కోరాడు విశ్వామిత్రుడు. అతడి కోర్కెకు నిరాకరించాడు వశిష్ఠుడు. వశిష్ఠుడిని తన పరాక్రమంతో జయించి, నందిని తీసుకువెళ్ళాలనుకున్న విశ్వామిత్రుడి ప్రయత్నం వృధా అయ్యింది. తపస్సుకు ఉన్న శక్తిని అప్పుడు గ్రహించిన విశ్వామిత్రుడు తను కూడా బ్రహ్మర్షి కావాలనుకున్నాడు.

అలా ఒకసారి తపస్సు చేస్తుండగా త్రిశంకుడు అనే రాజు శరీరంతో స్వర్గం పోవాలని కోరుకున్నాడు. విశ్వామిత్రుడు అతడి చేత యజ్ఞం చేయించి, అలా వచ్చిన శక్తితో అతడిని శరీరంతో స్వర్గానికి పంపాలనుకున్నాడు. ఆ ప్రయత్నం తుదిదశలో ఉండగా, అంటే త్రిశంకుడు శరీరంతో స్వర్గం వెడుతుండగా, ఇంద్రుడి అది గ్రహించి, 'శరీరంతో స్వర్గప్రవేశం చేయడానికి అర్హత లేదు' అంటూ త్రిశంకుడిని స్వర్గం నుంచి బయటకు పంపేశాడు. తలకిందులుగా భూమిపై పడుతున్న త్రిశంకుడు తనను కాపాడమని విశ్వామిత్రుడిని వేడుకున్నాడు. తన తపోబలంతో భూమికి, స్వర్గానికి మధ్య త్రిశంకుడి కోసం ఏకంగా స్వర్గాన్నే సృష్టించాడు విశ్వామిత్రుడు. చివరకు ఇంద్రుడు దిగివచ్చి, మరో స్వర్గం ఉండరాదని, కనుక త్రిశంకుడిని స్వర్గ ప్రవేశార్హత కల్పిస్తానని చెప్పడంతో ఆ స్వర్గాన్ని ఇంద్రుడికి ఇచ్చాడు విశ్వామిత్రుడు.

మరల మరోసారి తపస్సు చేస్తుండగా అతడి తపస్సు భగ్నం చేయడానికి ఇంద్రుడు మేనకను పంపిస్తాడు. మేనక వల్ల విశ్వామిత్రునికి శకుంతల అనే కుమార్తె కలిగింది. శకుంతల, దుష్యంతుల కుమారుడు భరతుడు. ఇక శునశ్శేపుడి కథలో కూడా విశ్వామిత్రుడి గురించి కనపడుతుంది. హరిశ్చంద్రుడి సత్యవ్రతాన్ని పరీక్షించినదీ, రామలక్ష్మణులకు అస్త్రశస్త్రవిద్యలు నేర్పించినదీ విశ్వామిత్రుడే. ప్రాణాలు కాపాడుకోవడానికి విశ్వామిత్రుడు ఒకసారి కుక్కమాంసాన్ని తిన్నాడనే కథ కూడా ఉంది. ఇలా కథలలో కనిపించిన విశ్వామిత్రుడి మనుమడు భరతుడి పేరుమీదగానే భరతఖండం, భారతదేశం అనే పేర్లు వచ్చాయని చెబుతారు.

అర్జునుడికి దివ్య అశ్వములిచ్చిన అంగారపర్ణుడు

అంగారపర్ణుడు ఒక గంధర్వుడు. ద్రౌపది స్వయంవరం విషయం తెలుసుకుని పాండవులు ద్రుపదరాజు వద్దకు వెళ్ళే సమయంలో వారిని అడ్డగించి తనతో యుద్ధం చేసి గెలవమని సవాలు చేస్తాడు అంగారపర్ణుడు. అప్పుడు అర్జునుడు యుద్ధం చేసి, అతడిని ఓడిస్తాడు. యుద్ధంలో ఓడిపోయిన అంగారపర్ణుడు, పాండవులతో మిత్రత్వం వహించి, అర్జునుడికి చాక్షుసి అనే విద్యను ఉపదేశించి, దివ్య అశ్వములనిస్తాడు. అర్జునుడితో యుద్ధం చేసినప్పుడు, తన రథం ధ్వంసం కావడంతో మరో రథం సృష్టించుకుని అప్పటి నుంచి చిత్రరథుడనే పేరుతో స్థిరపడతాడు.

అష్టవసువులు

గంగాదేవికి, శంతనుడికీ జన్మించిన ఎనిమిది మంది కుమారులు అష్టవసువులే. శాపవశాత్తూ వీరు మానవ జన్మ ఎత్తవలసి వచ్చింది. అష్టవసువుల అసలు పేర్లు ఆపుడు, ధృవుడు, సోముడు, ధరుడు, అనిలుడు, అనలుడు, ప్రత్యూషుడు, ప్రభాసుడు. ఒకసారి అష్టవసువులు వసిష్ఠుని ఆశ్రమానికి వెళ్ళి, అక్కడ కామధేనువు వంటిదైన నందిని అనే ఆవును చూసి, అది తమకు కావాలని కోరారు. వసిష్ఠుడు దీనికి తిరస్కరించడంతో దానిని అపహరించాలని అష్టవసువులు భావించారు. ప్రభాసుని నాయకత్వంలో ఆ ఆవును అపహరించేందుకు ప్రయత్నించగా, వసిష్ఠుడు అది తెలుసుకుని, భూలోకంలో జన్మించమని శపిస్తాడు. అష్టవసువులు శాపవిమోచనం కోసం వేడుకోగా, గంగకు జన్మించిన అష్టవసువులలో ప్రభాసుడు మినహా మిగిలిన వారందరూ వెంటనే మరణించి తిరిగి పూర్వరూపానికి వస్తారని, ఎక్కువ పాపం (గోవును అపహరించేందుకు యత్నం) చేసిన ప్రభాసుడు చిరకాలం జీవించి, చివరకు యథారూపానికి వస్తాడని వసిష్ఠుడు శాపవిమోచన మార్గం చెబుతాడు. ప్రభాసుడు మినహా మిగిలిన వారందరూ పుట్టగానే మరణించగా, ప్రభాసుడు ఎక్కువకాలం జీవిస్తాడు. అతడే భీష్ముడు.

దేవతల వైద్యులు అశ్వినులు

సూర్యుని భార్య సంజ్ఞ. భర్త వేడి తాళలేక, అతనిని విడిచి అశ్వరూపంలో వెళ్ళిపోతుంది సంజ్ఞ. సూర్యుడు కూడా అశ్వరూపం దాల్చి, సంజ్ఞను చేరతాడు. వారిద్దరూ ఆ రూపంలో ఉన్నప్పుడు జన్మించిన వారే అశ్వినులు. వీరినే అశ్వినీ దేవతలు అని కూడా అంటారు. వీరి అసలు పేర్లు నాసత్యుడు. దస్రుడు. వీరి వైద్యంలో అత్యంత నిపుణులు. దేవతల వైద్యులు వీరే. చ్యవన మహర్షికి యవ్వనమిచ్చినది అశ్వినులే. కుంతి ఉపదేశించిన మంత్రాన్ని పఠించిన మాద్రి, ఆశ్వినులను తలచుకున్నప్పుడు జన్మించిన వారే నకుల సహదేవులు.

ఆయుర్వేదానికి అధిపతి ధన్వంతరి

విష్ణుమూర్తి ఒక అవతారమే ధన్వంతరి అని భావిస్తారు. క్షీర సాగర మథన సమయంలో అమృతభాండంతో సహా ఉద్భవించింది ధన్వంతరే. ఆయుర్వేదానికి, వైద్యశాస్త్రానికి అధిపతి ఈ ధన్వంతరి. భరద్వాజ మహర్షి వద్ద ధన్వంతరి ఆయుర్వేదాన్ని నేర్చుకున్నాడు. తర్వాత ఇతను కాశీకి రాజయ్యాడు. ఇతని కుమారుడు దివోదాసు.

ధనాధిపతి కుబేరుడు

దిక్పాలకులలో కుబేరుడు ఒకడు. ఉత్తర దిక్కుకు, సమస్త సంపదలకు అధిపతి కుబేరుడు. విశ్రవోబ్రహ్మకు కుమారుడితడు. ఇతని తల్లి ఇలబిల. ఇతని సవతి తమ్ముడు రావణుడు. బ్రహ్మ గురించి తపస్సు చేసిన కుబేరుడు ధనాధిపత్యం, లంక అనే నగరం, నలకూబరుడనే కుమారుడిని వరంగా పొందుతాడు. ఒకసారి అతను తన పుష్పకము అనే విమానంలో సంచరిస్తుండగా అది చూసిన రావణుని తల్లి కైకసి, ఆ విమానము తీసుకురమ్మని ఆదేశిస్తుంది. అప్పుడు రావణుడు ముందు శివుని గురించి తపస్సు చేసి, ఆయనను మెప్పించి అనేక వరాలు పొందుతాడు. తర్వాత కుబేరుడి వద్ద నుంచి లంక నగరాన్ని, పుష్పక విమానాన్ని పొందుతాడు. నలకూబరుడు కాక మణిగ్రీవుడనే మరో కుమారుడు కుబేరుడికి ఉన్నాడు. వేంకటేశ్వరునికి వివాహ సమయంలో ధనాన్ని అప్పుగా ఇచ్చింది కుబేరుడే.

కుమారస్వామి

శివపార్వతులకు జన్మించిన పుత్రుడు కుమారస్వామి, శివుని వీర్యం భూమిపై పడగా, గంగ ఆ వీర్యాన్ని గ్రహించి ఈ పుత్రుడికి జన్మనిచ్చింది. ఆరుముఖాలతో జన్మించిన కుమారస్వామిని కృత్తికలు చేరదీసి పెంచుతారు. తారకాసురుడనే రాక్షసుడిని సంహరిస్తాడు కుమారస్వామి, తర్వాత కాలంలో మహిషాసురుడు తదితర రాక్షసులు మునులను, ప్రజలను బాధించి క్రౌంచపర్వతమనే రెక్కలున్న పర్వతం వద్ద దాక్కుండడం గమనించి, ఆ పర్వతం రెక్కలను తెగగొట్టినది కుమారస్వామే. విఘ్నాధిపత్యం కోసం వినాయకునితో పోటీపడిన కుమారస్వామి తుదకు వినాయకుని గొప్ప తనాన్ని గ్రహిస్తాడు. నెమలి ఇతని వాహనం. ఈటె ఆయుధం.

నికుంభుడు

నికుంభుడు ప్రమధ గణములలో ఒకడు. ఒకరోజు శివుడు నికుంభుని పిలిచి, కాశీ నగరంలో నివాసం ఉండవలెననిపిస్తున్నదని, ప్రస్తుతం ఆ నగరంలో ఉన్న దివోదాసును అక్కడ నుంచి తప్పించే మార్గం చూడవలసిందిగా నికుంభుని ఆజ్ఞాపిస్తాడు. శివుని ఆజ్ఞకు బద్ధుడైన నికుంభుడు దివోదాసు వద్దకు వెళ్ళి నగరంలో ఈశ్వరునికి ఒక గుడి కట్టించవలసిందిగా సూచిస్తాడు. ఆ విధంగా దివోదాసు కట్టిస్తాడు. అయితే ఎంతకాలమైనా తను కోరిన కోర్కెలు ఈశ్వరుడు తీర్చకపోవడంతో కోపం వచ్చిన దివోదాసు కోపంతో ఆలయాన్ని పగులకొట్టిస్తాడు. ఆలయాన్ని పగుల కొట్టారన్న మిషతో నికుంభుడు, దివోదాసును కాశీ నగరాన్ని వదిలివెళ్ళమని సూచిస్తాడు. ఆ సూచన మేరకు దివోదాసు కాశీనగరాన్ని విడిచి వెళ్ళిన తర్వాత శివుడు విశ్వేశ్వరునిగా, పార్వతి అన్నపూర్ణగా కాశీ నగరంలో వెలశారు. అప్పటి నుంచే కాశీనగరం పరమపుణ్యక్షేత్రమైంది.

జగతికి వెలుగు సూర్యుడు

అదితి, కశ్యపుల కుమారుడు సూర్యుడు. సూర్యుని భార్య సంజ్ఞ. వీరిరువురి సంతానము యముడు, యమున. సూర్యుని వేడిని తాళలేక తన వంటి రూపమున్న స్త్రీని సృష్టించి సూర్యుని వద్ద ఉంచి, అశ్వ రూపంలో అడవులకు వెళ్ళిపోతుంది సంజ్ఞ. అశ్వరూపంలో ఉన్నప్పుడు అమెకు జన్మించిమ వారే అశ్వనీదేవతలు. సూర్యుని వద్ద మారురూపంలో ఉన్న స్త్రీ ఛాయ. వీరి సంతానము శని, సావర్ణి, తపతి. మోహినీ అవతారంలో విష్ణుమూర్తి రాక్షసులకు అమృతము పంమతూ, దేవతల రూపంలో ఉన్న రాహుకేతువులకూ అమృతమిచ్చినప్పుడు దానిని సూర్యుడు, చంద్రుడు గుర్తిస్తారు.

ఆ విషయం విష్ణుమూర్తికి చెప్పగా, అతడు సుదర్శనంతో రాహుకేతువుల శిరస్సులు ఖండిస్తాడు. సూర్యచంద్రులపై పగబూనిన రాహుకేతువులు అప్పుడప్పుడూ సూర్యుడినీ చంద్రుడినీ మింగడానికి ప్రయత్నించడం వల్ల గ్రహణాలు వస్తాయని పురాణాల కథనం. మహాభారతంలో కుంతికి సూర్యునికి జన్మిం చిన వాడే కర్ణుడు. ఇంకా సూర్యుని గురించి పురాణాలలో అనేక సందర్భాలలో కనిపిస్తుంది.

దేవశిల్పి విశ్వకర్మ

ప్రభాసుడనే మనువుకు, బృహస్పతి చెల్లెలైన యోగసిద్ధికి జన్మించిన వాడు విశ్వకర్మ. దేవతల నగరాలు, ఆయుధాల, రథాలు విశ్వకర్మ తయారుచేస్తాడు. ఇతని కుమార్తె సంజ్ఞ. ఈమె సూర్యుని భార్య. సూర్యుని వేడికి సంజ్ఞ తట్టుకోలేకపోవడంతో విశ్వకర్మ సూర్యుడికి సానబెట్టి, అతని వేడిని కొద్దిగా తగ్గిస్తాడు. సూర్యుడిని సానబెట్టిన పొడి నుంచి తయారుచేసిందే విష్ణుమూర్తి ఆయుధమైన సుదర్శన చక్రం. శ్రీకృష్ణుడికి ద్వారకను నిర్మించిందీ, పాండవులకు మయసభ నిర్మించిందీ విశ్వకర్మే. పురాణాలలో ఇతని పేరు ఇంకా అనేక చోట్ల కనిపిస్తుంది. ఘృతాచి అనే వనితను చూసి మోహించిన విశ్వకర్మ, మానవుడిగా జన్మించి ఆమెను వివాహమాడతాడు. వారికి జన్మించిన వారే అనేక వృత్తులలో నిపుణులుగా స్థిరపడ్డారని పురాణాలు చెబుతాయి.

అక్రూరుడు

అక్రూరుని మనస్తత్వంలో ద్వంద్వ స్వభావము కనపడుతుంది. మొదట కృష్ణునికి విరోధి వలె కనిపించిననూ, చివరకు అతడు కృష్ణుడంటే భయభక్తులు ఉన్న వ్యక్తి వలె మారతాడు. అక్రూరుని గురించిన ప్రస్తావన భారతములో మొదట కంసుడు ధనుర్యాగం పేరుతో శ్రీకృష్ణుని తన నగరానికి ఆహ్వానించడానికి తగిన వ్యక్తి కోసం అన్వేషిస్తున్నప్పుడు కనపడుతుంది. కంసుడు అక్రూరుని ఎంపిక చేసుకుని శ్రీకృష్ణుని తన నగరానికి తీసుకురావలసిందిగా అక్రూరుని రథసారథిగా పంపుతాడు. అక్రూరుడు కృష్ణుని వద్దకు వెళ్ళి, కంసుడు కపటోపాయం గురించి హెచ్చరిస్తాడు. అతడి హెచ్చరికతో కృష్ణుడు కంసుని వద్దకు వెళ్ళి, అతని అనుచరులను, చివరకు కంసుడినీ హతమారుస్తాడు.

అక్రూరుడు శ్రీకృష్ణుని వద్దకు వెళ్ళి సత్యభామ వివాహ విషయంలో కనిపిస్తుంది. సత్యభామను శతధన్వుడనే రాజుకిచ్చి వివాహం చేస్తానని సత్యబామ తండ్రి అయిన సత్రాజిత్తు ప్రకటిస్తాడు. చివరకు శ్రీకృష్ణునకిచ్చి వివాహం చేయగా, అక్రూరుడు శతధన్వుని వద్దకు వెళ్ళి, సత్రాజిత్తుతో యుద్ధం చేయడానికి ప్రేరేపిస్తాడు. ఆ యుద్ధంలో శతధన్వుడు సత్రాజిత్తుని హతమారుస్తాడు. ఇది తెలిసిన శ్రీకృష్ణుడు శతధన్వునిపై దండెత్తి యుద్ధంలో అతడిని సంహరిస్తాడు. ఆ తర్వాత అక్రూరుడు కృష్ణునికి భయపడి పారిపోగా, కృష్ణుడు అతనికి అభయమిచ్చి, ద్వారకలో ఉండడానికి అనుమతిస్తాడు.

దుర్వాసునికి ప్రాణభిక్ష పెట్టిన అంబరీషుడు

అంబరీషుడు విష్ణుమూర్తి భక్తుడు. నాభాగుడనే రాజు కుమారుడితడు. అశ్వమేధయాగము కూడా చేసిన ఈ రాజు, ఒకసారి ద్వాదశీవ్రతము చేసి, బోజనమునకు కూర్చునే సమయానికి దుర్వాసుడు రాగా, ఆయననూ భోజనానికి ఆహ్వానిస్తాడు. స్నానం చేసి వస్తానని నదికి వెళ్ళిన దుర్వాసుడు, సూర్యాస్తమయమవుతున్నా తిరిగిరాకపోసరికి, వ్రత ఫలం కోసం, అతిధికి అమర్యాద కలగకుండా ఉండడం కోసం ఏమి చేస్తే బాగుంటుందని అంబరీషుడు పెద్దలను సలహా కోరతాడు. మంచినీరు సేవించమని పురోహితులు, పెద్దలు ఇచ్చిన సలహా మేరకు అంబరీషుడు మంచినీరు సేవిస్తాడు. ఆ తర్వాత కొద్దిసేపటికి అక్కడకు వచ్చిన దుర్వాసుడు జరిగింది తెలుసుకుని కోపంతో తన జటాజూటం నుంచి కృత్య అనే రాక్షసిని సృష్టించి, అంబరీషుని సంహరింపుమని ఆదేశిస్తాడు.

అంబరీషుడు నిశ్చలంగా విష్ణుమూర్తిని ప్రార్థించే సరికి సుదర్శనము వచ్చి, దుర్వాసుని వెంట పడుతుంది. సుదర్శనం బారి నుంచి తప్పించుకోవడానికి ముల్లోకాలు తిరిగిన దుర్వాసుడు చివరకు నారదుని సలహా మీద చివరకు అంబరీషుని వేడుకోగా, అంబరీషుడు సుదర్శనాన్ని స్తుతించి, దుర్వాసుడికి ప్రాణభిక్ష పెడతాడు. పురాణాలలో అంబరీషుడి పేరు మహాభక్తుడిగా వెలుగొందుతుంది.

శివభక్తుడు పుష్పదంతుడు

పుష్పదంతుడు ఒక రాజు. మహా శివభక్తుడు. ప్రతిరోజూ కైలాసానికి వెళ్ళి శివుడిని ప్రత్యక్షముగా దర్శించి, పూజించిన తర్వాతే తను భోజనం చేసేవాడు. ఒకరోజు అతడు కైలాసానికి వెళ్ళిన సమయంలో శివుడు పార్వతికి ఒక రహస్యమైన కథను వివరిస్తున్నాడు. ఆ కథను చాటు నుంచి పుష్పదంతుడు వింటాడు. తర్వాత ఈ విషయం తెలుసుకున్న శివుడు, పుష్పదంతుడిని పిశాచానివి కమ్మని శపిస్తాడు. అతడే భేతాళుడని ఒక కథనం కాగా, మరో కథనం ప్రకారం పుష్పదంతుడు వరరుచి అనే పేరుతో మనిషిగా జన్మిస్తాడు. రెండు కథలలోనూ పుష్పదంతుడు శివభక్తుడిగానే చెబుతారు.

శివానుగ్రహ పాత్రుడు సిరియాళుడు

చిరుతొండడు అనే వైశ్యుడు పేరుమోసిన శివభక్తుడు. ఇతని కుమారుడు సిరియాళుడు. చిరుతొండని భక్తిని పరిక్షించాలనుకుని శివపార్వతులు వృద్ధులుగా మారువేషంలో వచ్చి, చిరుతొండని ఆతిధ్యాన్ని కోరారు. చిరుతొండడు వారికి ఆతిధ్యాన్నివ్వడానికి అంగీకరించాడు. అప్పుడు శివపార్వతులు సిరియాళుని వండి తమకు వడ్డించమని కోరారు. ఆ తర్వాత శివుడు మరో వేషమున సిరియాళుని వద్దకు వెళ్ళి, 'నీ తండ్రి నిన్ను హతమార్చి, అతిధుల ఆకలి తీర్చబోతున్నాడ"ని చెబుతాడు. సిరియాళుడు తొణకక, తండ్రి తన మాట మీద నిలబడడమే తనకు ముఖ్యమని చెప్పి, మరణానికి సిద్ధపడతాడు. చిరుతొండడు సిరియాళుని మాంసంతో భోజనం సిద్ధం చేయగా, భోజనానికి కూర్చున్న వృద్ధ దంపతులు కుమారుని పిలువమని కోరతారు. అప్పుడు చిరుతొండడు "సిరియాళా!" అని పిలవగానే సిరియాళుడు పరుగెత్తుకుంటూ తండ్రి వద్దకు చేరతాడు. శివపార్వతులు నిజరూపంలో ప్రత్యక్షమై సిరియాళుడు, చిరుతొండడు మహా భక్తులని కొనియాడతారు.

ఆహుకుడు

నలుడు పూర్వజన్మలో ఆహుకుడనే భిల్లుడిగా జన్మించాడు. అతడు శివభక్తుడు. అతని భక్తిని పరీక్షించేందుకు శివుడు ఒక ముని రూపంలో అతని వద్దకు వచ్చి, అతని ఇంటిలో తనకు ఆశ్రయమివ్వమని కోరెను. ఆహుకుడికి, అతని భార్యకు ఉన్న చోటు అతి తక్కువ కావడంతో మునికి, తన భార్యకు ఇంట్లో చోటిచ్చి, తను ఆరుబయట నిద్రించాడు. ఆ సమయంలో ఒక పులి అతడిని చంపేస్తుంది. అతని భార్య సహగమనం చేయబోగా, ఆ ముని ఏదైనా కోరుకోమని ఆహుకుడి భార్యకు సూచించగా, 'మీకు తోచిందివ్వ'మని ఆమె చెబుతుంది. అప్పుడు శివుడు నిజరూపంలో ప్రత్యక్షమై, వచ్చే జన్మలో మీరు నలదమయంతులుగా పుడతారని, తను హంస రూపంలో వారిద్దరినీ కలుపుతానని వరమిస్తాడు. ఆ వరప్రభావంతో ఆహుకుడే నలుడిగా జన్మించాడు. అతని భార్య దమయంతిగా పుట్టింది.

అశ్వత్థామ

కౌరవ, పాండవులకు రాజగురువైన ద్రోణుని కుమారుడు అశ్వత్థామ. పుట్టగానే గుర్రము వలే పెద్దగా సకిలించినందువలన ఆకాశవాణి ఇతడికి అశ్వత్థామ అని పేరు పెట్టింది. కౌరవపాండవులతో కలసి అశ్వత్థామ అస్త్రశస్త్ర విద్యలు నేర్చుకున్నాడు. అశ్వత్థామకు ద్రోణుడు బ్రహ్మశిరోనామకాస్త్రం అనే మహాస్త్రాన్ని ప్రసాదిస్తాడు. ఈ అస్త్రాన్ని ఎన్నడూ మనుషుల మీద ప్రయోగించవద్దని ద్రోణుడు అశ్వత్థామ నుంచి వాగ్దానం పొందుతాడు. అయితే చివరకు మహాభారత యుద్ధ సమయంలో దుర్యోధనునుడు తొడలు విరిగి పరాజితుడై పడిపోయినప్పుడు, అతడిని సంతోష పెట్టవలెననే ఉద్దేశంతో నిద్రిస్తున్న ఉపపాండవులను, శిఖండిని, ధృష్టద్యుమ్నుడిని సంహరిస్తాడు. అప్పుడు అశ్వత్థామను అడ్డగించిన అర్జునుడిపైకి బ్రహ్మశిరోనామకాస్త్రం ప్రయోగించడానికి సిద్ధపడతాడు. వ్యాసుడు వంటివారు వారించినప్పటికీ వినకుండా 'అపాండవగుగాక!' అని ఆ అస్త్రాన్ని ప్రయోగిస్తాడు. అర్జునుడు కూడా తిరిగి అదే అస్త్రాన్ని ప్రయోగిస్తాడు. అతడిని సంహరించడానికి ప్రయత్నించినప్పుడు కృష్ణుడు, వ్యాసుడు అర్జునుడిని వారించి, అశ్వత్థామ శిరస్సుపైన ఉన్న రత్నాన్ని తీసుకుని 'మూడు వేల సంవత్సరాల పాటు లోకములో రత్నం కోల్పోయిన బాధతో సంచరించమని కృష్ణుడు శపిస్తాడు. బ్రహ్మశిరోనామకాస్త్రం ప్రభావం వల్ల ఉత్తర గర్భంలో ఉన్న శిశువు మృతుడైనప్పటికీ కృష్ణుడు అతడిని పునర్జీవితుడను చేస్తాడు. అశ్వత్థామ సప్త చిరంజీవులలో ఒకడు. రానున్న సూర్యసావర్ణిక మన్వంతరంలో ఇతడు సప్తఋషులలో ఒకడుగా స్థానం సంపాదిస్తాడు.

పురాణాలు పేర్కొన్న ఇతర చిరంజీవులలో విభీషణుడు, హనుమంతుడు, వ్యాసుడు, కృపుడు, పరశురాముడు, బలిచక్రవర్తి.

భారతయుద్ధానికి 'బలి' అయిన బర్బరీకుడు

బర్బరీకుడు ఘటోత్కచుని కుమారుడు. ఇతని తల్లి మౌర్వి. మరొక కథనం ప్రకారం తండ్రి ఘటోత్కచుడైనా బర్బరీకుని తల్లి అహిలవతి. ఆమె నాగకన్య. తల్లి ఎవరన్నదీ అనే విషయంలో భిన్న కథనాలున్నా, బర్బరీకుని గురించి మిగిలిన కథంతా ఒకటే విధంగా ఉంది. బర్బరీకుని బాల్యమంతా తల్లి వద్దే గడిచింది. ఆమె వద్దే శస్త్రాస్త్ర విద్యలు నేర్చుకుంటాడు. మహాభారత యుద్ధం జరగబోతున్నదని తెలుసుకుని, ఆ యుద్ధంలో ఓడిపోయేవారి తరుపున పోరాడతానని తల్లి వద్ద ప్రతిన చేసి కేవలం మూడు బాణాలతో యుద్ధ భూమికి వస్తాడు బర్బరీకుడు. అప్పటికతడు పిల్లవాడే. అయితేనేం మహా యోధుడు. కేవలం మూడు బాణాలతో యుద్ధ ఫలితాన్ని మార్చేయగలనన్న నమ్మకం, శక్తి అతనిది. అతని ప్రతిజ్ఞ తెలిసిన శ్రీకృష్ణుడు బర్బరీకుడిని పరీక్షించాలనుకుని బ్రాహ్మణుడి వేషంలో అతని వద్దకు వెళ్ళి 'నీ శక్తి చూపించు' అని కోరతాడు. బర్బరీకుడు ఒక బాణం తీసుకుని సుదూరంలో ఉన్న వృక్షానికేసి సంధిస్తాడు. ఆ ఒక్క బాణం వృక్షానికి ఉన్న ఆకులన్నింటికీ రంధ్రాలు చేయడమే కాక, శ్రీకృష్ణుడి కాలి కింద ఆకు ఉన్నదని గ్రహించిన ఆ అస్త్రం కృష్ణుడి కాలికి గాయం చేసి మరీ ఆ ఆకుకూ రంధ్రం చేస్తుంది. బర్బరీకుని శక్తి గ్రహించిన శ్రీకృష్ణుడు, తనకు మరో సాయం చేయాలని కోరతాడు. ఆ సాయానికి బర్బరీకుడు అంగీకరించిన తర్వాత, 'మహాభారత యుద్ధ ప్రారంభానికి ముందు ఒక మహాయోధుని బలి ఇవ్వవలసి ఉందని, ఆ బలికి నీ శిరస్సు కావాల'ని చెబుతాడు. అయితే తనకు మహాభారత యుద్ధం చూడాలని ఉందని, తనను బలి ఇచ్చినా శిరస్సుకు మాత్రం యుద్ధానికి చూసే శక్తిని ప్రసాదించాలని బర్బరీకుడు కోరతాడు. అలా మహాభారత యుద్ధానికి ముందే బలి అయిపోతాడు బర్బరీకుడు.

సగర పుత్రులను భస్మం చేసిన కపిలుడు

భగీరథుని పేరు మనకు తెలుసు. గంగను భూమి మీదకు రప్పించడానికి అతడు చేసిన ప్రయత్నాలకు భగీరథ ప్రయత్నాలని పేరు. ఈ భగీరథ ప్రయత్నానికి పరోక్షంగా కారకుడు కపిలుడు. సగరుడనే రాజు అశ్వమేధ యాగం చేయగా, ఆ యాగాశ్వం పాతాళంలో తపస్సు చేసుకుంటున్న కపిలుని వద్దకు పోతుంది. యాగాశ్వము వెంట వెళ్ళిన సగరపుత్రుల అలికిడికి కపిలుడు కోపంగా కళ్ళు తెరిచి చూడగా, సగరపుత్రులందరూ భస్మమైపోతారు. మరణించిన సగరపుత్రులు పుణ్యలోకాలకు చేరాలంటే ఈ భస్మంపై గంగ ప్రవహించాలన్న కపిలుని సూచన మేరకు దిలీపుని కుమారుడైన భగీరథుడు ఎంతో ప్రయత్నం చేసిన గంగను భూమి మీదకు తీసుకువస్తాడు.

రావణుని జయించిన మాంధాత

యువనాశ్వుని కుమారుడు మాంధాత. భృగు మహర్షి దాచి ఉంచిన మంత్ర జలం సేవించినందువల్ల యువనాశ్వుని భార్యకు మాంధాత జన్మిస్తాడు. 12వ ఏటనే రాజ్యాభిషిక్తుడైన మాంధాత ఎంతో బలవంతుడని తెలుసుకున్న రావణుడు అతనితో యుద్ధం చేయడానికి వచ్చి, ఆ యుద్ధంలో ఓడిపోతాడు. బ్రహ్మ, ఇంద్రుడు వచ్చి మాంధాతకు, రావణునికీ సంధి చేయడంతో రావణుడు తిరిగి లంకకు చేరుకుంటాడు. ఇతనికి ముచికుందుడు సహా అనేక మంది కుమారులున్నారు.

నలుడు

నలుడు నిషధదేశ రాజు వీరసేనుడి కుమారుడు. పూర్వజన్మలో ఇతడు ఆహుకుడనే భిల్లుడు. శివుని వర ప్రభావం వల్ల ఇతడు నలుడిగా జన్మించాడు. శని దృష్టి ప్రభావం ఒకరి జీవితాన్ని ఎంతగా దిగజారుస్తుందో తెలియజేయడానికి నలుని కథ ఒక ఉదాహరణ. నలుడు ఒకరోజు తన ఉద్యానవనంలోని ఒక హంసను పట్టుకోగా, అప్పుడా హంస మానవభాషలో మాట్లాడుతూ, తనను విడువమని, అలా విడిచిపెట్టినట్టయితే దమయంతి అనే అందాలరాశితో వివాహమయ్యే విధంగా ప్రయత్నిస్తానని చెబుతుంది. నలుడు ఆ హంసను వదిలేయగా, హంస దమయంతి వద్దకు వెళ్ళి, నలుడి గురించి చెబుతుంది. నలుడి గుణగణాలు విన్న దమయంతి అతడినే వివాహం చేసుకుంటానని చెబుతుంది. అయితే స్వయంవరానికి నలుగురు దిక్పాలకులు నలుని వలె మారువేషంలో వచ్చినా, చివరకు ఆమె నలుడినే గుర్తించి, అతడిని వరిస్తుంది. అయితే దమయంతి నలుడినే వరించడంతో దిక్పాలకులు అసూయ పెంచుకుని, నలుడి పగబడతారు. ఒకనాడు శని వారితో కలిసి, తను అవకాశం చూసుకుని నలుడిపై దృష్టి సారిస్తానని చెబుతాడు. ఒకరోజు అపరిశుభ్రంగా ఇంట్లోకి వచ్చిన నలుడిని శని పట్టిపీడించడం ప్రారంభిస్తాడు. శని ప్రభావంతో పుష్కరుడనే రాజుతో జూదానికి దిగిన నలుడు రాజ్యం సర్వస్వం కోల్పోతాడు. ఒక అడవిలో పక్షులను పట్టుకోవడానికి తన వద్ద ఉన్న వస్త్రం విసరగా, పక్షులు ఆ వస్త్రంతో సహా ఎగిరిపోతాయి. కర్కోటకుడు అనే పాము అడవిలో కార్చిచ్చులో చిక్కుకోగా, ఆ పామును నలుడు రక్షిస్తాడు. ఆ సర్పం వెంటనే నలుడిని కరుస్తుంది. నలుడు కురూపిగా మారిన తర్వాత ఆ సర్పం ఈ రూపం నీకు వరం వంటిదని, నలుడిగా ఎవరూ గుర్తించరని, అశ్వహృదయమనే విద్య నేర్పి, అదృశ్యమవుతుంది. అశ్వహృదయమనే విద్య ప్రత్యేకత ఏమిటంటే, ఏ అశ్వం ఎటువంటిదో గుర్తించి, దాని శక్తిసామర్థ్యాల మేరకు అశ్వాన్ని అత్యంత వేగంతో నడపగలగడం సాధ్యమవుతుంది. నలుడు దమయంతిని అడవిలో వదిలేయగా, ఆమె తన తండ్రి వద్దకు చేరుతుంది. నలుడు ఋతుపర్ణుడనే రాజు వద్ద బాహుకుడనే పేరుతో వంటవానిగా చేరతాడు. నలుడు అడవిలో అదృశ్యమయ్యాడని, జరిగింది తండ్రికి దమయంతి చెప్పగా, అతడు నలుడి కోసం గూఢచారులను అన్ని రాజ్యాలకూ పంపుతాడు. నలుడు కురూపిగా మారినా, అతని గుణగణాల ఆధారంగా గూఢచారులు అతడిని నలుడిగా అనుమానించి, ఆ విషయాన్ని తమ రాజుకు చెబుతారు. అప్పుడారాజు, తన కుమార్తెకు తిరిగి స్వయంవరం నిర్వహిస్తున్నానని ప్రకటిస్తాడు. సమయం తక్కువగా ఉన్నప్పటికీ అశ్వహృదయం తెలిసిన బాహుకుడు ఋతుపర్ణుడిని త్వరగా దమయంతి స్వయంవరానికి చేర్చగలుగుతాడు. అక్కడ బాహుకుడికి అనేక పరీక్షలు నిర్వహించి, అతడే నలుడు అని తేల్చడంతో నలుడు తిరిగి తన సహజ రూపానికి వస్తాడు. తర్వాత పుష్కరుడిని ఓడించి, తన రాజ్యం కూడా సంపాదించుకుంటాడు.

సర్పరాజు వాసుకి

నాగజాతికి అధిపతిగా వాసుకి పేరు మనకు అనేక చోట్ల కనిపిస్తుంది. క్షీరసాగర మథన సమయంలో మంధర పర్వతానికి తాడుగా ఉపయోగించింది ఈ నాగరాజునే. వాసుకి కద్రువ కుమారుడు. జనమేజయుడు చేస్తున్న సర్పయాగాన్ని మాన్పించడానికి జరత్కారువును ప్రేరేపించిన వారిలో వాసుకి కూడా ఒకరు.

శిఖండి

ద్రుపదరాజు కుమార్తె శిఖండి. పూర్వ జన్మలో ఈమే అంబ. గత జన్మలో అంబ సాల్వుడనే రాజును ప్రేమిస్తుంది. అయితే స్వయంవరానికి హాజరైన భీష్ముడు స్వయంవరానికి హాజరైన ఇతర రాజులను ఓడించి, ఈమె చెల్లెళ్ళైన అంబిక, అంబాలికలను తన సోదరులకిచ్చి వివాహం చేయాలనే ఆలోచనతో తనతో తీసుకువస్తాడు. అంబ సాల్వుడనే రాజును ప్రేమిస్తున్నదని తెలిసి, ఆమెను సాల్వుడి వద్దకే పంపగా, సాల్వుడు ఆమెను తిరస్కరిస్తాడు. భీష్ముడి వద్దకు వెళ్ళి జరిగింది చెప్పి, తనను వివాహం చేసుకోమని కోరుతుంది. తను వివాహం చేసుకోనని ప్రతిజ్ఞ చేసినందున, ఎవరినీ వివాహం చేసుకోనని చెబుతాడు. ఇలా భీష్ముని కారణంగా వివాహం కాకుండా పోయిన అంబ చివరకు శివుడి గురించి ఘోరమైన తపస్సు చేసి, తన చేతిలోనే భీష్ముని మరణం సంభవించాలని కోరుకుంటుంది. అలా కోరుకున్న అంబే ఇప్పుడు శిఖండిగా జన్మించింది. ఈమెను కుమారుడిగానే పెంచిన ద్రుపదరాజు, అతనికి వివాహం చేస్తాడు. తర్వాత శిఖండి పురుషుడు కాదని తెలిసిన అతని భార్య తిరిగి పుట్టింటికి వెళ్ళిపోగా, శిఖండి ఆత్మహత్యకు ప్రయత్నిస్తాడు. అప్పుడొక యక్షుడు ప్రత్యక్షమై, ఆత్మహత్యయత్నాన్ని నివారించి అతడికి పురుషత్వాన్ని ప్రసాదిస్తాడు. మహాభారత యుద్ధ సమయములో భీష్ముడిని జయించడానికి శిఖండిని అడ్డు పెట్టుకుంటాడు అర్జునుడు. శిఖండిని చూసిన భీష్ముడు అస్త్రసన్యాసం చేసిన తర్వాత ఆయనను తీవ్రంగా గాయపరుస్తాడు. అలా గాయపడిన భీష్ముడు తర్వాత మరణిస్తాడు. శిఖండి కారణంగానే భీష్ముని మరణం ఆ విధంగా సంభవిస్తుంది.

అహల్యా తనయులు వాలిసుగ్రీవులు.

అహల్యా శాపవృత్తాంతము మనకు తెలుసు. అహల్యకు ఇంద్రుని వలన కలిగిన సంతానమే వాలిసుగ్రీవులు. ఒకసారి గౌతముడికి వారెవరి సంతానమూ అన్న విషయమై సందేహము వచ్చి, "నా సంతానం కాని పక్షంలో వానరులుగా మారిపోండి!" అని శపిస్తాడు. దానితో వారిద్దరూ వానరులైపోతారు. వారిని గౌతముడు వదిలివేయడంతో వానర రూపులై సంచరిస్తుంటారు. ఆదిమ వానరుడైన ఋక్షవిరజుడు వీరిద్దరినీ చేరదీసి పెంచుతాడు. పెద్దవాడైన వాలిని కిష్కింధకు రాజును చేసింది ఋక్షవిరజుడే. చివరకు రాముని బాణానికి వాలి చనిపోతాడు. సుగ్రీవుడు రాముని మిత్రుడై, కిష్కింధకు రాజై చిరకాలం జీవిస్తాడు. వాలి మహాబలవంతుడు. రావణాసురుని సైతం వాలి యుద్ధంలో జయిస్తాడు.

ఆదిమ వానరుడు ఋక్ష విరజాదు

రామాయణంలో కనిపించే వాలిసుగ్రీవుల తండ్రి ఇతడు. బ్రహ్మ తపస్సు చేసుకుంటున్న సమయంలో ఆయన కళ్ళ నుండి రాలిన అశ్రువుల నుంచి జన్మించిన వాడు ఋక్షవిరజాడు. అరణ్యంలో తిరుగాడుతుండగా కనిపించిన ఒక చెరువులో దిగిన ఋక్షవిరజాడు, ఆ చెరువు నుంచి బయటకు వచ్చేసరికి స్త్రీగా మారిపోతాడు. గతంలో పార్వతి ఆ చెరువులో స్నానం చేయడం వల్ల అలా జరిగిందని బ్రహ్మ అతనికి చెబుతాడు. స్త్రీగా మారిన ఋక్షవిరజాడికి ఇంద్రుని వల్ల వాలిసుగ్రీవులు జన్మిస్తారు. ఆ తర్వాత వానరజాతి విస్తరిస్తుంది.

బలిచక్రవర్తి

ప్రహ్లాదుని కుమారుడైన విరోచనుని తనయుడు బలిచక్రవర్తి. ఇతని భార్య అశన. రాక్షసుడైనప్పటికీ ఇతనిలో ఎన్నో సుగుణాలున్నాయి. స్వర్గం మీద దండెత్తి ఇంద్రుని ఓడించి, స్వర్గాధిపత్యం సంపాదిస్తాడు. ఒకసారి ప్రహ్లాదునితో మాట్లాడుతూ, విష్ణుమూర్తిని తూలనాడడంతో ప్రహ్లాదునికి కోపం వచ్చి, శ్రీహరి వల్లే నీ పదవి పోతుందని శపిస్తాడు. తుదకు బలిచక్రవరి మూడు లోకాలను ఆక్రమించుకున్నప్పుడు విష్ణుమూర్తి వామనుడిగా అవతారమెత్తి, యజ్ఞం చేస్తున్న బలిచక్రవర్తి వద్దకు వచ్చి, మూడు అడుగుల నేలను దానం కోరతాడు. వచ్చింది శ్రీహరే అని గ్రహించిన రాక్షస గురువు శుక్రాచార్యుడు, బలిచక్రవర్తి దానమివ్వకుండా కమండలం నుంచి కారుతున్న నీటి ధారకు అడ్డం పడగా, వామనుడు దర్భతో కమండలం కొమ్ములో పొడుస్తాడు. ఆ దర్భ తగిలి శుక్రాచార్యునికి ఒక కన్ను పోతుంది. తుదకు వామనుడు ఒక అడుగుతో నేలను, మరొక అడుగుతో ఆకాశాన్ని ఆక్రమించి, మూడవ అడుగు కోసం చోటు చూపమని బలిచక్రవర్తిని కోరగా, బలి చక్రవర్తి తన శిరస్సు చూపుతాడు. మూడవ అడుగు అక్కడ మోపి, బలిచక్రవర్తిని పాతాళానికి పంపుతాడు. చిరంజీవులలో ఇతడొకడు.

కర్ణుడిని కీటకముగా పీడించిన గ్రస్తుడు

గ్రస్తుడు ఒక రాక్షసుడు. శాపవశాత్తూ కీటకముగా జన్మించాడు. 'తను బ్రాహ్మణుడును' అని కర్ణుడు పరశురాముని వద్ద అస్త్ర, శస్త్ర విద్యలు నేర్చుకుంటున్న సమయాన ఒక రోజు కర్ణుడి తొడ మీద పరశురాముడు తల ఉంచి నిద్రపోతుంటాడు. ఆ సమయాన కీటక రూపంలో వున్న గ్రస్తుడు కర్ణుడి తొడను తొలవడం ప్రారంభిస్తాడు. అయితే పరశురాముడికి నిద్రాభంగమవుతుందనే ఉద్దేశంతో కర్ణుడు కదలక అదేవిధంగా కూర్చుంటాడు. నిద్ర నుండి లేచిన తర్వాత పరశురాముడు జరిగింది చూసి, కర్ణుడిని అనుమానించి 'నీదే కులము' అని ప్రశ్నించగా, నిజం చెబుతాడు కర్ణుడు. దానితో ఆగ్రహించిన పరశురాముడు కర్ణుడిని 'అవసర సమయంలో తాను నేర్పిన విద్య జ్ఞప్తికి రాదని' శపిస్తాడు. మహాభారత యుద్ధ సమయంలో కర్ణుడు ఓడిపోవడానికి ఈ శాపం ఒక కారణమైతే, ఆ శాపానికి కారకుడు గ్రస్తుడు.

హిరణ్యాక్ష, హిరణ్యకశ్యపులు

వైకుంఠంలోని విష్ణుమూర్తి సన్నిధి వద్ద ద్వారపాలకులైన జయవిజయులే హిరణ్యాక్ష హిరణ్యకశ్యపులు. 'మీరు మీ యజమాని అయిన విష్ణుమూర్తి సేవకు దూరం కండి!' అని సనకసనందనాదుల శపించిన తర్వాత, విష్ణుమూర్తి 'ఏడు జన్మలు నా భక్తులుగా జన్మిస్తారా? లేక మూడు జన్మలు శత్రువులుగా పుడతారా?' అని అడగడంతో "భక్తులైనప్పటికీ ఏడు జన్మల కాలం మీకు దూరం కాలేమని, విరోధులుగా అయినా సరే మూడు జన్మల తర్వాత తిరిగి మీ సాన్నిధ్యానికి చేరుకుంటాము" అని జయవిజయులు కోరుకోవడంతో జయవిజయులు మూడు జన్మలు విరోధులుగా జన్మించేట్టు నిర్ణయం జరిగింది. ఆ విధంగా మొదట జన్మే ఈ హిరణ్యాక్ష హిరణ్యకశ్యపులు.

హిర్యణ్యాక్ష, హిరణ్యకశ్యపులు అన్నదమ్ములు. హిరణ్యాక్షుడు ఒకసారి గర్వంతో భూమిని చాపలా చుట్టడానికి ప్రయత్నించగా, భూదేవి విష్ణుమూర్తికి మొరపెట్టుకుంది. ఆ మొర విని విష్ణుమూర్తి వరాహస్వామిగా అవతరించి హిరణ్యాక్షుని సంహరించి భూమిని కాపాడాడు. సోదరుని మరణంతో ప్రతీకారేచ్ఛతో రగిలిపోయిన హిరణ్యకశ్యపుడు ఘోరమైన తపస్సు చేసి బ్రహ్మ నుంచి అనేక వరాలు పొందాడు. పగలు కాని- రాత్రికాని, ఇంటిలోపల కాని- ఇంటి వెలుపల కాని, జీవం ఉన్న పదార్థం లేదా నిర్జీవ పదార్థంతో కాని, దేవదానవుల చేత, మనిషి చేత కాని- జంతువు చేత కాని చావు రాకుండా పొందిన వరం వాటిలో ఒకటి. హిరణ్యకశ్యపుని కుమారుడు ప్రహ్లాదుడు.

అతను విష్ణుమూర్తికి భక్తుడు. విష్ణుమూర్తికి భక్తుడైనందువల్ల కుమారుడిని హిరణ్యకశ్యపుడు అనేక విధాలుగా శిక్షించాడు. చివరకు భగవంతుడైన శ్రీహరి ఎక్కడ ఉన్నాడని ప్రహ్లాదుని, హిరణ్యకశ్యపుడు ప్రశ్నించగా, విశ్వమంతటా శ్రీహరినిండి ఉన్నాడని చెబుతాడు ప్రహ్లాదుడు. ఒక స్తంభాన్ని చూపి 'ఈ స్తంభంలో శ్రీహరిని చూపమని' హిరణ్యకశ్యపుడు స్తంభాన్ని గదతో బద్దలు కొట్టగా, ఆ స్తంభం నుంచి ఉద్భవిస్తాడు నరసింహస్వామి. సంధ్యాసమయంలో ఇంటి గుమ్మంపై, గోళ్ళతో చీల్చి హిరణ్యకశ్యపుని ఆయన సంహరిస్తాడు. ఇదీ హిరణ్యాక్ష హిరణ్యకశ్యపుల కథ.

యాదవ విరోధి కాలయవనుడు

గర్గుని కుమారుడు కాలయవనుడు. ఒకసారి యాదవులు ఎగతాళి చేయడంతో వారిపై పగ పెంచుకున్న గర్గుడు, అతి బలవంతుడైన కుమారుడిని పొందేవిధంగా శివుని నుండి వరం పొందుతాడు. అలా వరప్రభావంతో జన్మించినవాడే కాలయవనుడు. పెరిగి పెద్దవాడైన కాలయవనుడు తండ్రి పగ గురించి తెలుసుకుని, యాదవులపై పగతీర్చుకునేందుకు మధురానగరి మీద దాడికి సిద్ధమవుతాడు. యాదవులకు నాయకత్వం వహిస్తున్న శ్రీకృష్ణునికి మరో శత్రువు కూడా ఉన్నాడు. అతడు జరాసంధుడు. కాలయవనుడు యుద్ధానికి వస్తున్నాడన్న వార్త తెలుసుకున్న కృష్ణుడు, ఇదే సమయంలో జరాసంధుడు కూడా యుద్ధానికి వస్తే గెలవడం కష్టమని భావించి, విశ్వకర్మను పిలిపించి సముద్రం మధ్యలో శత్రు దుర్భేద్యమైన కోటను నిర్మించవలసిందిగా కోరతాడు. అతి తక్కువ సమయంలో విశ్వకర్మ ఆ పని పూర్తిచేస్తాడు. వెంటనే మధురను ఖాళీ చేసి ద్వారకకు తరలిపోతారు. ఒకసారి అనుకోకుండా తనకు తారసపడిన శ్రీకృష్ణుడితో యుద్ధానికి సిద్ధపడతాడు కాలయవనుడు. శివుడి వరం గురించి తెలిసిన శ్రీకృష్ణుడు ముచికుందుడు నిద్రిస్తున్న గుహలోకి ప్రవేశించి అదృశ్యమవుతాడు. ముచికుందుడికి నిద్రాభంగం కలిగించిన కాలయవనుడు, అతడు కళ్ళు తెరచి చూడగానే భస్మమవుతాడు.

కౌరవులు- పేర్లు

దుర్యోధనుడు, దుశ్శాసనుడు దుర్ధర్షుడు, జలసంధుడు, సహుడు, సముడు, విందుడు, అనువిందుడు, దుర్భాషుడు సుబాహుడు, దుష్ప్రధర్షణుడు, ధర్మధుడు, చిత్రయోధి, దుష్కర్ణుడు, కర్ణుడు, వివింశతి, జయసంధి, సులోచనుడు, చిత్రుడు, ఉపచిత్రుడు, చిత్రాక్షుడు, చారుచిత్రూడు, శతాననుడు, ధర్మర్షణుడు, దుర్ధర్షణుడు, వివిర్సుడు, కటుడు, శముడు, ఊర్ణనాభుడు, సునాధుడు, నందకుడు, ఉపనందకుడు, సేనాపతి, సుషేణుడు, కుండో, మహోదరుడు, చిత్రధ్వజుడు, చిత్రరధుడు, చిత్రభానుడు, అమిత్రజిత్, చిత్రభాణుడు, సువర్మడు, దుర్విమోచనుడు, చిత్రసేనుడు, విక్రాంతకుడు, సుచిత్రుడు, చిత్రవర్మభృత్, అపరాజితుడు, పండితుడు, శాలాక్షుడు, దురావజితుడు, జయంతుడు, జయత్సేనుడు, దుర్జయుడు, దృఢహస్తుడు, సుహస్తుడు, వాతవేగుడు, సువర్చనుడు, ఆదిత్యుడు, కేతువు, బహ్వాంశి, నాగదంతుడు, ఉగ్రశాయి, కవచి, నషంగి, దాసి, దండధారుడు, దనుర్గ్రహుడు, ఉగ్రుడఉ, భీముడు, రధభీముడు, భీమబాహుడు, ఆలోపుడు, భీమకర్మడు, సుబాహుడు, భీమవిక్రాంతుడు, అభయుడు, రౌద్రకర్మడు, దృఢరధుడు, అనాన్పృద్పుడు, కుండభేది, విరావి, దీర్ఘలోచనుడు, దీర్ఘధ్వజుడు, దీర్ఘభుజుడు, అదిర్ఘుడు, దీర్ఘుడు, దీర్ఘబాహుడు, మహాబాహుడు, వ్యూఢోరుడు, కనకధ్వజుడు, మహాకుండుడు, కుండుడు, కుండజుడు, చిత్రజాసనుడు, చిత్రకుడు, కవి, వీరి సోదరి దుస్సల.

మహా బలసంపన్నులు- మధుకైటభులు

సృష్టికి పూర్వం విష్ణుమూర్తి క్షీరసాగరంలో నిద్రిస్తున్న సమయంలో ఆయన చెవుల నుండి ఇద్దరు రాక్షసులు ఉద్భవించారు. వారే మధుకైటభులు. అప్పుడు ఇంకా భూమి లేదు. చుట్టూ సముద్రమే. పుట్టిన వెంటనే వారు తమ పుట్టుకకు కారణమేమి? ఈ స్థితిని శాసిస్తున్న శక్తి ఎవరు అని ఆలోచిస్తూ, ఆ శక్తిని ఉద్దేశించి వేయి సంవత్సరాలపాటు తపస్సు చేశారు. వారి తపస్సుకు ఆదిశక్తి ప్రత్యక్షం కాగా స్వచ్ఛంద మరణాన్ని వరంగా కోరుకున్నారు. ఆదిశక్తి ఆ వరాన్ని ప్రసాదించి అదృశ్యం కాగా, మధుకైటభులు బ్రహ్మాది దేవతలను పీడించసాగారు.

అప్పుడు బ్రహ్మ విష్ణుమూర్తికి మొరపెట్టుకోగా, విష్ణుమూర్తి వారితో యుద్ధానికి దిగారు. యుద్ధం ఎంతకాలం కొనసాగినా, జయాపజయాలు తేలకపోవడంతో, చివరకు విష్ణుమూర్తి ఆదిశక్తిని ప్రార్థించి, ఆమె సూచన ప్రకారం, మధుకైటభులను పొగడ్తలతో ముంచెత్తాడు. 'ఏదైనా వరం కోరుకోండ'ని అడగగా, 'మేమే నీకు వరమిస్తాము' అని ఆ రాక్షసులు అన్నారు. అప్పుడు విష్ణుమూర్తి 'మీరిద్దరూ నాచేతిలో మరణించాలి' అని అన్నాడు. వెంటనే మధుకైటభులు "నీరు లేని ప్రదేశంలో మమ్ము సంహరించు" అని కోరారు. వారి కోరిక మేరకు విష్ణుమూర్తి తన తొడలను విశాలంగా పెంచి, ఆ తొడలపై రాక్షసులను సంహరించాడు. అధర్మవర్తన ఉన్న కారణంగా మధుకైటభులను రాక్షసులుగా పరిగణించారు.

భారతమున మరో వాసుదేవుడు పౌండ్రకుడు

పౌండ్రక వాసుదేవుడు కరూశ దేశాధిపతి. శ్రీకృష్ణుడికి వాసుదేవుడు అనే మరో పేరు కూడా ఉన్నది. తన పేరు కూడా వాసుదేవుడే కావడంతో ఒకే కాలంలో ఇద్దరు వాసుదేవులు, అందునా తనకు పోటీగా మరో వాసుదేవుడు ఉండడం తగదని భావించాడు వాసుదేవుడు. ఈ కారణంతో శ్రీకృష్ణునితో విరోధము పెంచుకున్నాడు. ఒక సమయంలో శ్రీకృష్ణుడు కైలాసానికి వెళ్ళినప్పుడు పౌండ్రక వాసుదేవుడు ద్వారకా నగరము మీద దాడి చేస్తాడు. సాత్యకి పౌండ్రక వాసుదేవుడిని తరిమి వేస్తాడు. మరోసారి శ్రీకృష్ణునితో ప్రత్యక్ష యుద్ధానికి దిగగా, శ్రీకృష్ణుడు అతడిని యుద్ధంలో సంహరిస్తాడు.

దశగ్రీవుడే రావణుడు

విష్ణుమూర్తి ద్వారపాలకులైె జయ విజయులు శాపవశాత్తూ ఎత్తిన రెండవ అవతారం రావణ కుంభకర్ణులు. రామాయణ గాథలో వీరిద్దరి పేర్లూ కనిపిస్తాయి. మూడవ బ్రహ్మ అయిన విశ్వవుకు సుమాలి అనే కూతురు కలదు. ఆమె కూతురు కైకసి. ఆమెకు విశ్రవశువునికి జన్మించిన కుమారుడు రావణాసురుడు. విశ్రవసునికి, కైకసికి ముగ్గురు కుమారులు. రావణుడు, కుంభకర్ణుడు, విభీషణుడు అని ఒక కథనం కాగా, విశ్రవశుని తపస్సుకు భయపడి, ఇంద్రుడు ముగ్గురు స్త్రీలను పంపగా వారి వల్ల విశ్రవసునికి రావణ కుంభకర్ణాదులు జన్మించారని మరో కథనం ఉంది. ఇంద్రుడు పంపిన స్త్రీలలో బుష్పోత్కటకు రావణ కుంభకర్ణులు, మాలినికి విభీషణుడు, పాకకు ఖరుడు, శూర్పణఖ జన్మించారు.

రావణునికి విశ్రవశుడు పెట్టిన పేరు దశగ్రీవుడు. రావణాసురుడికి దశకంఠుడని పేరు. అంటే పదితలలున్నవాడని అర్థం. పదితలలు ఉండడానికి ఒక కారణమున్నది. రావణాసురుడు గత జన్మలో హిరణ్యకశ్యపుడు. నృసింహస్వామి తనను సంహరించు సమయమున "ఇరవై ఆయుధాలతో (గోళ్లతో) నన్ను చంపడం న్యాయమా?" అని ప్రశ్నించగా, "వచ్చే జన్మలో ఇరవై చేతులు, పది తలలతో పుడతావని, అపుడు నేను సామాన్యుని వలె సంహరిస్తాను" అని నరసింహస్వామి అనుగ్రహించాడన్నది కథనం. కుబేరుని ఓడించి అతని పుష్పక విమానాన్ని రావణుడు కైవశం చేసుకున్నాడు. లంకను రాజధానిగా చేసుకుని పరిపాలించాడు. అతని భార్య మండోదరి. మేఘనాథుడు అనే కుమారుడు వీరిద్దరికీ జన్మించాడు. మహావీరుడైన కార్తవీర్యార్జుని చేతిలో రావణుడు ఒకసారి, వాలి చేతిలో మరొకసారి యుద్ధములో ఓడిపోయాడు.

ఆ తర్వాత అతడిని యుద్ధంలో ఓడించినది రాముడు మాత్రమే. రావణుని సోదరుడు కుంభకర్ణుడు. అతడు బ్రహ్మ గురించి తపస్సు చేయగా, వరమిచ్చే సమయంలో సరస్వతీ దేవి ప్రభావంతో "ఆరు నెలలు నిద్ర, ఒక రోజు ఆహారం" చొప్పున కోరుకున్నాడు. ఆరునెలల నిద్రాభంగం చేస్తే అతని శక్తి తగ్గుతుందని, పూర్తినిద్ర పోయి, పూర్తి ఆహారం తీసుకుంటే మాత్రం అతడిని ఓడించేవారే ఉండరని బ్రహ్మ వరమిచ్చాడు. ఆరునెలల నిద్ర పూర్తి కాకముందే లేచి రామునితో యుద్ధానికి వెళ్లవలసి రావడంతో కుంభకర్ణుడు మరణించాడు.

శిశుపాలుని సోదరుడు సాల్వుడు

సాల్వుడనే పేరు భారతంలో ప్రముఖంగా అందరికీ తెలిసేది ఒక్క చోటే. తన సోదరుల వివాహం కోసం సత్యవ్రతుడు (భీష్ముడు) అంబ, అంబిక, అంబాలిక అనే యువతులను స్వయంవరంలో మిగిలిన రాజులను ఓడించి తీసుకుని వచ్చినప్పుడు, అంబ తను సాల్వుని వలచానని చెబుతుంది. ఆమెను భీష్ముడు సాల్వుని వద్దకు వెళ్ళమని వదిలివేస్తాడు. ఆ సందర్భంలో కనిపించిన సాల్వుడు దమఘోషుని కుమారుడు. శిశుపాలుని తమ్ముడు. శిశుపాలుడిని రాజసూయ యాగంలో శ్రీకృష్ణుడు వధించిన తర్వాత అతనిని విరోధిగా బావించి, శివుడి గురించి తపస్సు చేస్తాడు. శివుడి నుంచి ఆకాశగమనం, అద్భుత పటిష్ఠ నగరం వరాలుగా పొందిన సాల్వుడు శ్రీకృష్ణుని జయించేందుకు అనేక సార్లు ప్రయత్నాలు సాగించి, చివరకు అతని చేతిలో చనిపోతాడు.

ప్రద్యుమ్నుని ప్రత్యర్థి శంబరాసురుడు

శంబరాసురుడు జటాసురుని కుమారుడు. శ్రీకృష్ణుని కుమారుడైన ప్రద్యుమ్నుని చేతిలో తన మరణం ఉన్నదని తెలుసుకున్న శంబరాసురుడు, ప్రద్యుమ్నుడు పుట్టిన ఎనిమిదవ రోజునే అతనిని అపహరించి నీళ్ళలో పడవేస్తాడు. నీళ్ళలో అతడిని ఒక చేప మింగగా, ఆ చేప తిరిగి శంబరాసురుని కుమార్తెకు దొరుకుతుంది. ఆ చేప కడుపులో దొరికిన ప్రద్యుమ్నుని శంబరాసురుని కుమార్తె పెంచి పెద్ద వాడిని చేస్తుండగా, శంబరాసురునికి విషయం తెలిసి, ప్రద్యుమ్నుని హతమార్చడానికి ప్రయత్నిస్తాడు. ఆ యుద్ధంలో ప్రద్యుమ్నుడే శంబరాసురుడిని హతమారుస్తాడు.

శ్రీకృష్ణుడు నిర్జించిన శిశుపాల, దంతవక్త్రులు

విష్ణుమూర్తి ద్వారపాలకులైన జయవిజయుల మూడవ అవతారం శిశుపాల, దంతవక్త్రులు. శ్రీకృష్ణ అవతారంలో వీరిద్దరినీ విష్ణుమూర్తి సంహరించాడు. శిశుపాలుని తండ్రి దమఘోషుడు. తల్లి సాత్వతి. శ్రీకృష్ణుని మేనత్తే సాత్వతి. శిశుపాలుడు నాలుగు చేతులతో, నుదుట నేత్రంతో జన్మించాడు. "ఎవరు ఈ బాలుడిని ఎత్తుకున్నప్పుడు రెండు చేతులూ, నేత్రమూ అదృశ్యమవుతాయో, వారి చేతిలో ఈ బాలుడు మరణిస్తాడు" అని ఆకాశవాణి చెప్పింది. చివరకు శ్రీకృష్ణుడు ఆ బాలుడిని ఎత్తుకున్నప్పుడు రెండు చేతులూ నుదుట కన్ను అదృశ్యమవడంతో, తన కుమారుడు శ్రీకృష్ణుని చేతిలో మరణిస్తాడని సాత్వతి ధృవీకరించుకున్నది. అందుకే "నూరు తప్పులు చేసే వరకూ తన కుమారుడిని క్షమించు" అని సాత్వతి శ్రీకృష్ణుని కోరుకున్నది. శ్రీకృష్ణుడు ఆమె కోరిక మేరకు శిశుపాలుడు నూరు తప్పులు చేసేవరకూ క్షమించి, తుదకు ధర్మరాజు రాజసూయ,యాగము చేసే సమయంలో, తన అగ్రపూజను నిందించినపుడు సంహరిస్తాడు. అప్పటికి అతని నూరు తప్పులూ పూర్తయినట్టు లెక్క. ఇక దంతవక్త్రుడు ఇతని సోదరుడే. ఇతని మిత్రులైన సాల్వ పౌండ్రక వాసుదేవుడిని శ్రీకృష్ణుడు హతమార్చడంతో, అతడిని విరోధిగా భావిస్తాడు దంతవక్త్రుడు. ఆ వైరం పెరిగి శ్రీకృష్ణుడితో ప్రత్యక్ష యుద్ధానికి దారితీస్తుంది. ఆ యుద్ధంలో దంతవక్త్రుడినీ సంహరిస్తాడు కృష్ణుడు. ఈ జన్మతో జయవిజయుల శాపం తీరడంతో తిరిగి వారిద్దరూ విష్ణుమూర్తి సాన్నిధ్యంలో ద్వారపాలకులుగా తమ పూర్వస్థానానికి చేరుకుంటారు.

తారకాసురుడు

వజ్రాంగుడనే రాక్షసుని కుమారుడు తారకాసురుడు. బ్రహ్మ కోసం తీవ్రమైన తపస్సు చేసిన తారకాసురుడు సృష్టిలో తనకు సమానమైన బలం కలిగిన వీరుడు లేకుండా వరం కోరుకుంటాడు. బ్రహ్మ ఆ వరం ఇచ్చిన తర్వాత ఆ రాక్షసుడు విజృంభించి అన్ని లోకాల వారినీ బాధించడం ప్రారంభించగా, చివరకు శివుని కుమారుడే తారకాసురుడిని వధించగలడని బ్రహ్మ చెబుతాడు. శివపార్వతులకు జన్మించిన కుమారస్వామి తారకాసురుడితో యుద్ధం చేసి, ఆ యుద్ధంలో అతడిని సంహరిస్తాడు.